# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







## కాంగ్రెస్ వస్తే..

**కుదుటపడ్డ రైతుల బతుకుల్లో చీకట్లు నింపే ప్రయత్నం చేస్తున్నారని అన్నదాతల ఆగ్రహం**

# దిన దిన గండమే

- ఎవుసంపై కాంగ్రెస్ కడుపుమంట
- 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లతో కుట్రలు
- రైతుల కొంప ముంచే మాటలతో కాంగ్రెసోళ్ల కపట నాటకం
- నమ్మితే కష్టాలను కొనితెచ్చుకున్నట్లేనంటున్న రైతాంగం

రంగారెడ్డి, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ పూటకోమాట మాట్లాడుతూ రైతుల బతుకులను ఆగం చేసేందుకు కుట్రలు పన్నుతున్నది. మొన్నటివరకు 3 గంటల కరెంటు చాలన్న కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటూ కొత్త పల్లవిని అందుకున్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీపై రంగారెడ్డి జిల్లా రైతాంగం అగ్గిమీద గుగ్గిలమవుతున్నది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌తోపాటు రైతు బంధుతో సాగుకు పెట్టుబడి సాయం, కావల్సినన్ని నీళ్లు అంది ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్న తరుణంలో మళ్లీ పాత రోజులు తెచ్చేందుకు కాంగ్రెస్ నేతలు చేస్తున్న కుయుక్తులను చూసి రైతు కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. 3 గంటల కరెంటుతో పొలంలో ఒక మూలకు సైతం నీరు పారదని, 10 హెచ్‌పీ మోటర్లతో నీళ్లన్ని తోడేస్తే ఆతర్వాత బోర్ల పరిస్థితి, పంటల పరిస్థితి ఏంటని? రైతులు ప్రశ్నిస్తున్నారు. అత్తెసరు కరెంటు, 10 హెచ్‌పీ మోటర్ల కారణంగా తరచుగా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు, స్టార్టర్లు కాలిపోయి ఆర్థికంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే తమ బతుకులు అంధకారమయం కావడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలను కొని తెచ్చుకున్నేట్లనని రైతాంగం పేర్కొంటున్నది.

### 10 హెచ్‌పీ మోటర్లు అవసరమే లేదు

**- లండం శేఖర్, మోటర్ వైండింగ్ మెకానిక్, ఆమనగల్లు మున్సిపాలిటీ 14వ వార్డు**



వ్యవసాయం చేయని రేవంత్‌రెడ్డికి 10 హెచ్‌పీ, 3 హెచ్‌పీ మోటర్ల గురించి ఏం తెలుస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాల్సి వస్తుంది. అవి ఉంటాయో కాలిపోతయో తెలువదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే 200 నుంచి 300 అడుగుల లోతులో బోరు వేయాలి. 10 ఫీట్ల కేసింగ్ పైపులు వేయాలి. ఈ లెక్కన ఒక బోరు వేస్తే దాదాపు 2 లక్షల ఖర్చు అవుతుంది. 10 హెచ్‌పీ మోటర్ కొనాలంటే రూ.40 వేలకు పైగా అవుతుంది. అది కాలిపోతే రిపేరు చేయాలంటే రూ.10 వేలకు పైగానే అవుతుంది. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ కూడా పెంచాలి. ఇంత ఖర్చు సాధారణ రైతు భరించడం చాలా కష్టమైన పని. 3 గంటలు మోటరు నడిస్తే ఒక ఎకరం మాత్రమే పారుతుంది. 10 హెచ్‌పీ మోటర్ పెట్టి 3 గంటల కరెంట్ మాత్రమే ఇస్తే రైతులందరూ ఒకేసారి మోటర్లు అన్‌చేస్తే లోడింగ్ ఎక్కువ పడి ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయే ప్రమాదముంటుంది కావున రైతులకు 10 హెచ్‌పీ మోటర్లు అవసరమే లేదు.

### మూడు గంటల కరెంట్ సరిపోదు

**- నేనావత్ పాండునాయక్, కడ్తాల్**



తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇస్తామంటున్న మూడు గంటల కరెంట్‌తో పొలానికి నీరు పారదు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయం గురించి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. మూడు గంటల కరెంట్‌తో పంటలకు నీరందక ఎండిపోతాయి. కాంగ్రెస్‌ను నమ్మితే వ్యవసాయం పూర్తిగా ఆగమైతది. రైతులు 10 హెచ్‌పీ వాడమని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఎప్పుడైనా వ్యవసాయం చేశారా? 10 హెచ్‌పీ మోటర్ వాడే ఆర్థిక స్థోమత రైతులకు ఉండదు, ఆ మోటర్‌తో బోర్లు ఎండిపోతాయి. 10 హెచ్‌పీతో లాభం కన్నా రిపేర్లే ఎక్కువ. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కాంగ్రెస్‌ను రైతులు నమ్మే రోజులు పోయాయి. రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వమే మళ్లీ రావాలి.

### మూడు గంటల కరెంట్ రైతులకు సరిపోదు

**- రమేశ్, బోరు మెకానిక్(రైతు), తలకొండపల్లి**



రైతులకు మూడు గంటల కరెంట్ అస్సలు సరిపోదు. మూడు గంటల కరెంట్‌తో రైతులకు రెండు మడులు పొలం పారదు. ప్రస్తుతం ఉన్న కరెంట్‌తోని రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రైతులకు 10 హెచ్‌పీ మోటర్లతో ఎలాంటి ప్రయోజనం లేదు. 500 ఫీట్లకు పైగా క్రిందికి వాటర్ ఉన్నప్పుడు 10 హెచ్‌పీ మోటర్ అవసరం అవుతుంది. ఇప్పుడు ఎక్కడ చూసినా వంద నుంచి రెండు వందల ఫీట్లలోపే వాటర్ ఉంది కాబట్టి ఇప్పుడు ఉన్న కరెంట్‌తోని రైతులకు ఉన్న పొలం అంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లు పెట్టుకుంటున్నారు. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

### 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయడం చాలా కష్టం

**- మేకల సుధాకర్, సురంగల్, మొయినాబాద్**



10 హెచ్‌పీ మోటర్లు పెట్టి వ్యవసాయం చేయడం చాలా కష్టం. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే రూ.లక్ష కావాలి. అది సన్న, చిన్నకారు రైతులకు భారం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంట్ ఇస్తామని అంటున్నారు. 3 గంటల కరెంట్ పగలు ఇస్తారా..? రాత్రి ఇస్తారా చెప్పడం లేదు. రైతులు 3, 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని వ్యవసాయం చేస్తున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద ఒకేసారి లోడ్ పడుతుంది. అప్పుడు లో ఓల్టేజీ ఏర్పడి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మళ్లీ పాత రోజులే వస్తాయి. వ్యవసాయంలో నష్టం వచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు రైతుకు ఉచితంగా కరెంట్ ఇస్తున్నది. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ రైతులు నష్టపోతారు.

### 3 గంటల కరెంట్ సరిపోతుందనడం అవివేకం

**- రఘుపతిరెడ్డి, రైతు, చేవెళ్ల టౌన్**



కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కరెంట్ కోతలతో పంటలు ఎండిపోయి చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాంగ్రెస్ 3 గంటల కరెంట్ ఇస్తామని అంటే మళ్లీ పాత రోజులు వచ్చినట్లే. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్ ఇవ్వడంతో పంటలు పండించుకుని సంతోషంగా జీవిస్తున్నాం.

### మూడు గంటలిస్తే ముచ్చెమటలే..


**-గోవర్ధనం ప్రవీణ్‌కుమార్, పసుమాముల, పెద్దఅంబర్‌పేట**



24 గంటలు విద్యుత్తు సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. కానీ, రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకు కాంగ్రెసోళ్లు మరోసారి సిద్ధమయ్యిండ్రు. మూడు గంటలే సరిపోతదని మాటలతోనే ముచ్చెమటలు పట్టిస్తుండ్రు. మూడు గంటలు కరెంటిస్తామన్నోళ్లకు బుద్ధి చెప్పాల్సిందే. కటికచీకట్లు కమ్ముకోక ముందే కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి.

### కాంగ్రెసోళ్లకు ఏమి తెలుసు

**- వెంకటేశ్, రైతు, షాద్‌నగర్‌టౌన్**



వ్యవసాయం గురించి కాంగ్రెసోళ్లకు ఏమి తెలుసని 3 గంటల కరెంట్ ఇస్తామంటున్నారు. ఎకరాకు నీళ్లు పట్టేందుకు ఎన్ని గంటల విద్యుత్ సరిపోతుందో తెలుసా అసలు. పొలం వద్ద 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లే నడుస్తున్నాయి. 10 హెచ్‌పీ మోటర్‌తో ఉన్న నీటిని వాడేస్తే బోర్లు ఎండిపోవడంతోపాటు రైతులకు ఖర్చు ఎక్కువ అయితది. 10 హెచ్‌పీ మోటర్లు ఒకేసారి ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదముంది. కాంగ్రెస్ హయాంలో రైతులు కంటి నిండ నిద్ర కూడా పోలేదు. ఎప్పుడు చూసినా పొలం వద్దనే ఉండేవాళ్లం. రైతుల తలరాతను మార్చేలా రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్ అందించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్.

### కాంగ్రెస్ వస్తే మన బతుకులు వెనక్కే..

**- ఏజాస్, శంకర్‌పల్లి**



తెలంగాణ రైతులు పడుతున్న బాధలు చూడలేక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తూ రైతులకు అండగా నిలిచారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన 3 గంటల కరెంటుతో ఒక్క మడి కూడా తడవకుండే.. ఇప్పుడు తెలంగాణ సీఎం 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల పంటలు బాగా పండుతున్నాయి. కేసీఆర్ పాలనలో కరెంట్ షాక్‌లు లేవు, పాము కాట్లు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ మన బతుకులు వెనక్కి వెళ్లాల్సి వస్తది. రాత్రిళ్లు పొలాల వద్ద జాగారం చేయాల్సివస్తది. 3 గంటల కరెంటుకు 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే సన్న, చిన్నకారు రైతులకు ఆర్థికంగా చాలా ఇబ్బంది. రైతులను కష్టపెట్టే కాంగ్రెస్ వద్దు, రైతులకు భరోసా కల్పించే బీఆర్ఎస్ పార్టీ కావాలి.

### కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెపుతాం

**- ఎదిరె రాములు, రైతు, దేవునిఎర్రవల్లి, చేవెళ్ల రూరల్**



మా పొలంలో 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను వాడి పంటలు పండిస్తున్నాం. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్ వాడితే చాలా సమస్యలు వస్తాయి. కరెంట్ లోడ్ ఎక్కువ అయితది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. పొలాలు ఎండిపోతయి. రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ అవలంబిస్తున్నది. రైతులందరూ వారికి తగిన బుద్ధి చెపుతారు. కాంగ్రెస్ పార్టీని పాతాళంలోకి తొక్కేస్తారు. రైతులకు వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఉండాలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాలి.

### మూడు గంటలిస్తే ఒక్కమడి కూడా తడువదు

**- పి.పోచయ్య, రైతు, కుమ్మరిగూడ, షాబాద్**



వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడటం సరికాదు. మూడు గంటల కరెంట్ ఇస్తే ఒక్క మడి కూడా సరిగా తడవదు. గతంలో కరెంట్ కోసం అనేక కష్టాలు పడ్డాం. బోర్లలో నీరు లేకపోవడంతో, అప్పటి ప్రభుత్వాలు కరెంట్ సరిగ్గా ఇవ్వకపోవడంతో వ్యవసాయం చేయాలంటే అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. తెలంగాణ వచ్చినంక రైతుల కష్టాలు నేరుగా తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా కరెంట్ ఇస్తున్నారు. పంటలకు అవసరమున్న సమయంలో బోరు ఆన్ చేసుకుని నీరు పెడుతున్నాం. రాత్రిపూట కరెంట్ కోసం బోరు మోటర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన పనిలేకుండా పోయింది. సీఎం కేసీఆర్‌తోనే రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుంది.